సాక్షి కామారెడ్డి

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



పైప్‌లైన్ లీకేజీలు..

నస్రుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాలలో పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితమవుతోంది.

- 8లో ▸



అందుబాటులో ఎరువులు

జిల్లాలో రబీ సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని డీఏవో తిరుమల ప్రసాద్ తెలిపారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.9 /15.5

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సెపక్‌తక్రాలో ఫైనల్‌కు చేరిన జిల్లా బాలికల జట్టు



కామారెడ్డి అర్బన్: హనుమకొండలో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటుతోంది. శనివారం నిర్వహించిన సెమీస్‌లో గెలిచి ఫైనల్‌కు చేరిందని సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్, నరేశ్ తెలిపారు. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుతో తలపడుతుందని పేర్కొన్నారు. జిల్లా బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్‌లో ఆసిఫాబాద్ జట్టుపై ఓడిపోయిందని తెలిపారు.

నైపుణ్య శిక్షణ పోటీల్లో ప్రథమ స్థానం



భిక్కనూరు: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి నైపుణ్య శిక్షణ పోటీల్లో భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాల టీచర్ శ్వేత శిరీష ప్రథమ స్థానంలో నిలిచారు. ఆమె వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు గంప నాగేశ్వర్‌రావు ప్రశంస పత్రం, ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు మాధవి, రాంచంద్రం పాల్గొన్నారు.

కామారెడ్డికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో విద్యుత్ కష్టాలు తీర్చేందుకు 33/11కేవీ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించినట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ సమస్య ఏర్పడినప్పుడు పట్టణంలోని సబ్ స్టేషన్‌ల నుంచి కరెంటు సరఫరా చేయడం ద్వారా పట్టణ సబ్ స్టేషన్‌లపై ఎక్కువ లోడ్ పడుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు తన దృష్టికి తీసుకురావడంతో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిలతో చర్చించి పట్టణానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించానని తెలిపారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారని, మూడు నెలలలోపు సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

క్షేత్ర స్థాయిలో ఉష్ణోగ్రతల పరిశీలన



కామారెడ్డి క్రైం: ఉష్ణోగ్రతల నమోదును మ్యాన్‌వల్‌గా నిర్ధారించేందుకు సీపీవో కార్యాలయ సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. డొంగ్లీ మండల కేంద్రంతో పాటు బొమ్మన్‌దేవ్‌పల్లిలో జి.భార్గవరెడ్డి, అనిల్‌రెడ్డి, దత్తు, వెంకటరమణ తదితరులు పర్యటించి, ఉష్ణోగ్రతలను నమోదు చేశారు. టీజీడీపీఎస్ సీఈవో షేక్‌మీరా ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాలకు వెళ్లి ఉష్ణోగ్రతలను పరిశీలించినట్లు తెలిపారు.

టీసీసీ పరీక్షల షెడ్యూల్ ఖరారు

కామారెడ్డి టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలను వచ్చేనెల 11 వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, టైలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని వివరించారు. ఇతర వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రంగుమారిన రాజకీయం!

2024లో ఎన్నో మార్పులు

- కాంగ్రెస్ ఖాతాలో ఎంపీ స్థానం
- హస్తం గూటికి చేరిన పోచారం
- వ్యవసాయ సలహాదారుగా షబ్బీర్
- ప్రత్యేకాధికారుల పాలనలోకి స్థానిక సంస్థలు

రివైండ్ 2024

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాల గర్భంలో మరో ఏడాది కలిసిపోతోంది. రాజకీయంగా ఎన్నో మార్పులకు కేంద్రమైన 2024.. జ్ఞాపకంగా మిగిలిపోబోతోంది. ఈ ఏడాది రాజకీయంగా పలు సంచలనాలు నమోదయ్యాయి. పదేళ్లపాటు ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ పార్టీ మారడం, ఎమ్మెల్యేగా, మంత్రిగా, స్పీకర్‌గా అవకాశాలిచ్చిన బీఆర్‌ఎస్‌ను కాదని పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. రెండు మున్సిపాలిటీలలో అధ్యక్షులు మారారు. స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

స్థానిక సంస్థల్లో 'ప్రత్యేక' పాలన

స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీ కాలం ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. జిల్లాలోని 526 పంచాయతీలలో ఫిబ్రవరి 1న ప్రత్యేకాధికారుల



పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి

పాలన మొదలైంది. అలాగే జూలై 4న మండల పరిషత్‌లు, జూలై 5న జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది. మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వ్యవహరిస్తున్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించేదాకా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. మున్సిపల్ పాలక వర్గాల పదవీ కాలం కూడా వచ్చే నెలలో ముగియనుంది. పదవీకాలం ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించే అవకాశాలు లేకపోవడంతో వాటికీ ప్రత్యేకాధికారులు రానున్నారు.

షబ్బీర్‌కు సలహాదారు హోదా..

సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి పోటీ చేయడం కోసం తన సీటును త్యాగం చేసిన షబ్బీర్ అలీ.. నిజామాబాద్‌అర్బన్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి ఆయన వెన్నంటి నిలిచిన షబ్బీర్‌అలీకి సీఎం ప్రాధాన్యతనిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల ప్రభుత్వ సలహాదారుగా నియమించి గౌరవించారు. అయితే షబ్బీర్ అలీ మైనారిటీ కోటాలో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోచారం పార్టీ మార్పు

అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన వారు తర్వాతి ఎన్నికల్లో గెలవరన్న సెంటిమెంట్‌ను అధిగమించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడలో గెలిచి సత్తా చాటారు. అయితే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో ఆయన నారాజ్ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కొద్ది కాలానికే సీఎం రేవంత్‌రెడ్డి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఆయనను సర్కారు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా నియమించింది.

'కాసుల'కు దక్కిన పదవి

బాన్సువాడకు చెంది న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాసుల బాల్‌రాజ్‌ను నామినేటెడ్ పదవి వరించింది. ఆయన పలుమార్లు బాన్సువాడ నియోజకవర్గంనుంచి పోటీ చేసి ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో టికెట్టు దక్కకపోవడంతో మనస్తాపం చెందారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయనను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. అలాగే భిక్కనూరు మండలానికి చెందిన మద్ది చంద్రకాంత్ రెడ్డికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి వరించింది. కాగా రాష్ట్ర స్థాయి పదవుల కోసం జిల్లాకు చెందిన నేతలు ఎదురు చూస్తున్నారు.



బీజేఎల్పీ ఉపనాయకుడిగా కేవీఆర్

అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలను ఓడించి జెయింట్ కిల్లర్‌గా నిలిచిన కాటిపల్లి వెంకటరమణారెడ్డిని ఆ పార్టీ నాయకత్వం బీజేఎల్పీ ఉపనాయకుడిగా నియమించింది. కాగా వెంకటరమణారెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రయత్నిస్తున్నారు.

బల్దియాలలో అవిశ్వాసాలు..

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం నెగ్గడంతో ఆమె పదవినుంచి దిగిపోయారు. నూతన చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణపై అవిశ్వాసం నెగ్గింది. అనంతరం నూతన చైర్మన్‌గా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ రెండు బల్దియాలూ బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.



చైర్‌పర్సన్‌గా ఎన్నిక పత్రం అందుకుంటున్న ఇందుప్రియ

'జహీరాబాద్'పై కాంగ్రెస్ జెండా

పదేళ్ల పాటు తిరుగులేని రాజకీయ శక్తిగా సత్తా చాటిన బీఆర్‌ఎస్ గతేడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతింది. ఈ ఏడాది ప్రథమార్థంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మరింత చతికిలపడింది. చాలామంది నాయకులు పార్టీని వీడడంతో కోలుకోలేకపోయింది. దశాబ్ద కాలం పాటు ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ సైతం బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆయన బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో విజయం సాధించి, మిగతా మూడు నియోజక వర్గాల్లో బలాన్ని పెంచుకున్న బీజేపీ.. జహీరాబాద్ లోక్‌సభ సీటును గెలుచుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సిట్టింగ్ సీటును బీఆర్‌ఎస్ కోల్పోగా, సిట్టింగ్ ఎంపీని పార్టీలో చేర్చుకుని టికెట్టు ఇచ్చిన బీజేపీకి ఓటమే ఎదురయ్యింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి మెజారిటీ రాగా, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చింది. సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్‌కు గట్టి మద్దతు దక్కడంతో జహీరాబాద్ ఎంపీ సీటు కాంగ్రెస్ ఖాతాలో చేరింది.

హ్యాట్రిక్ కొట్టాలని కలలుగన్న బీబీ పాటిల్ ఆశలు ఆవిరయ్యాయి. కాగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంతో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టర్‌నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎంపీ సురేశ్ షెట్కార్

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ, చిత్రంలో డీఎస్పీ, సీఐలు, కానిస్టేబుళ్లు

ఎస్పీ సింధు శర్మ

బాన్సువాడ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ సింధు శర్మ సూచించారు. శనివారం బాన్సువాడ, బీర్కూర్ పోలీస్‌స్టేషన్లను ఆమె సందర్శించారు. బాన్సువాడలో ఇటీవల జరిగిన హత్యలు, సెల్‌ఫోన్ల చోరీ కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీసుల విధులు ఉండాలన్నారు. గతంతో పోల్చితే నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అధునాతన టెక్నాలజీపై పోలీస్ అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుల్స్‌కు పలు సూచనలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలని, రికార్డు నిర్వహణ, సీసీటీఎన్‌ఎస్, రిసెప్షను, కోర్టుడ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్ పెట్రోలింగ్ తదితర విధులను సీనియర్ పోలీసుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దులలో రాకపోకలపై నిఘా పెట్టాలని బీర్కూర్ స్టేషన్ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట డీఎస్పీ సత్యనారాయణ, బాన్సువాడ టౌన్, రూరల్ సీఐలు అశోక్, రాజేశ్ ఉన్నారు.

ఈతరాక.. ఊపిరాడక..

- ఎస్సై సాయికుమార్‌తో పాటు మరో ఇద్దరిదీ అదే పరిస్థితి
- మూడు మరణాల కేసులో కొనసాగుతున్న విచారణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో ఎస్సై, కానిస్టేబుల్, మరో యువకుడు మునిగి చనిపోయిన సంఘటనకు సంబంధించి పోలీసు అధికారులు విచారణ ముమ్మరం చేశారు. వారి మరణానికి గల కారణాలతో పాటు ఆ రోజు ఏం జరిగిందన్న దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. చెరువు నీటిలో ముగ్గురు పడిపోవడంతో జాలర్ల సాయంతో గాలించి వారి మృతదేహాలను బయటకు తీసిన విషయం తెలిసిందే. కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌లను పరిశీలించిన అధికారులు.. శ్రుతి, నిఖిల్‌లు పెళ్లి చేసుకోవాలనుకున్నారని గుర్తించారు. తర్వాత వారి మధ్య విభేదాలు ఎందుకు వచ్చాయోనన్న దాని గురించి ఆరా తీస్తున్నారు. వారు చెరువు వద్దకు వెళ్లి అక్కడ చర్చించుకున్న సమయంలో, చెరువులో దూకినపుడు ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడంతో అక్కడ ఏం జరిగిందన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు. దాదాపు రెండు కిలోమీటర్ల పొడవైన చెరువు కావడంతో ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా ఎక్కడా లేవు. ఆ రోజు చేపల వేటకు ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లకపోవడంతో ఈ ఘటన ఎవరి కంటా పడలేదని భావిస్తున్నారు.

నీరు మింగి..

భిక్కనూరు ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, అలాగే నిఖిల్ నీట మునిగింది లోతైన ప్రదేశంలో కావడంతో అందులో పడగానే లోపలికి వెళ్లిపోయి ఉంటారని భావిస్తున్నారు. ముగ్గురి మృతదేహాలు దొరికిన ప్రదేశం దాదాపు పదిమీటర్ల లోతు ఉంటుందని అంటున్నారు. ముందు ఎవరో ఒకరు దూకి ఉంటారని, వారిని కాపాడే క్రమంలో మిగతా ఇద్దరూ ఒకరి వెంట ఒకరు దూకి ఉంటార ని అంచనా వేస్తున్నారు. అయితే ముగ్గురికీ ఈత రాదని తెలుస్తోంది. లోతైన ప్రాంతంలో దూకడంతో ముగ్గురూ నీట మునిగి చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టుల్లో నీళ్లు మింగే చనిపోయారని వెల్లడైంది.



వివిధ కోణాల్లో దర్యాప్తు

ముగ్గురి మరణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాల్‌డేటాను పరిశీలించిన అధికారులు వాట్సాప్ చాటింగ్‌లపై దృష్టి సారించారు. అయితే ఫోన్లు లాక్ అయి ఉండడంతో వాటిలో నుంచి సమాచారం తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్పీ సింధుశర్మ కేసు పరిశోధన గురించి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా కేసు దర్యాప్తు గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. సాక్ష్యాధారాలు లేకపోవడంతో సాంకేతిక అంశాల ఆధారంగా కేసును కొలిక్కి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కేసు కొలిక్కి రావడానికి మరికొన్ని రోజుల సమయం పట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇందిరమ్మ సర్వేను త్వరగా పూర్తిచేయాలి

- పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలి
- వంద రోజుల 'ఉపాధి' చూపాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులు వేగవంతంగా, పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీవోలు సర్వే తీరును పరిశీలించాలన్నారు. జిల్లాలో 2,38,682 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 1,39,194 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యిందన్నారు. సర్వేను మూడో తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ మందులు పిచికారి చేయాలని సూచించారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏమైనా లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు. వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భవన నిర్మాణాలకు లేఅవుట్ అనుమతులు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇలాంటి 45 దరఖాస్తులను వేగంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బ్యాగుల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం పూర్తి చేయాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద రుణాలు మంజూరు చేయడంతో పాటు గతంలో తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల ఎదుగుదలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్డీవో సురేందర్, మిషన్ భగీరథ, గృహ నిర్మాణ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్

ఎట్టకేలకు లింగవ్వ అంత్యక్రియలు

- రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాతే నిర్వహణ

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి గ్రామంలో రెండు రోజులుగా ఫ్రీజర్‌లో ఉన్న లింగవ్వ మృతదేహానికి ఎట్టకేలకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి లింగవ్వకు మాయమాటలు చెప్పి సోదరుడి భూమితో పాటు దాయాదులకు సంబంధించిన భూమిని ఆమె చిన్న కుమారుడు రాంరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. లింగవ్వ ఈనెల 26న మరణించింది. అయితే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని తిరిగి తమ పేరిటకు మార్చిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహించాలని దాయాదులు పట్టుబట్టిన విషయం తెలిసిందే. దీనికి రాంరెడ్డి అంగీకరించినా.. వరుసగా రెండు రోజులు సెలవులు ఉండడంతో రిజిస్ట్రేషన్‌కు వీలుకాలేదు. దీంతో ఆమె మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు రాంరెడ్డి తన సోదరుడికి, దాయాదులకు సంబంధించిన భూమిని భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయంలో వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవడంతో లింగవ్వ అంత్యక్రియలు చేపట్టారు.

మూగబోయిన హక్కుల గొంతు

- గుండెపోటుతో ప్రముఖ న్యాయవాది మాధవరావు మృతి
- నివాళులు అర్పించిన నేతలు



ఖలీల్‌వాడి : ప్రముఖ న్యాయవాది, హక్కుల నేత గొర్రెపాటి మాధవరావు (67) శనివారం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించారు. మాధవరావు పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా 1983 నుంచి 1996 వరకు పని చేశారు. హక్కుల నేత బాలగోపాల్‌తో కలిసి 2004 నుంచి మానవహక్కుల వేదికలో భాగస్వామ్యం అయ్యారు. మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర మొదటి అధ్యక్షుడిగా 2019 నుంచి 2023 వరకు పని చేశారు. నిజామాబాద్‌లో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ స్మృతిలో ఏర్పాటు చేసిన ట్రస్ట్‌కు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు. అనేక పత్రికలకు వ్యాసాలు, పుస్తకాలు రాశారు. అనేక ప్రజాసంఘాల కార్యకర్తలకు తరగతులు బోధించారు. తెలంగాణ యూనివర్సిటీలో మొదటి తరం న్యాయశాస్త్ర విద్యార్థులకు తరగతులు బోధించారు. ఆయన పేదల తరపున, ఉద్యమ కేసులను ఉచితంగా వాదించేవారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు, విద్యార్థులపై పెట్టిన కేసులపై వాదించి ఉద్యమానికి సహకారం అందించారు. పోలీసుల రెండు బూటకపు ఎన్‌కౌంటర్‌లపై కోర్టులో కేసులు వేసి దేశ చరిత్రలో నిలిచారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించారు. మరొక వ్యక్తిని దొంగతనం కేసులో బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తే బాధితుల తరపున వాదించి రూ. లక్ష నష్టపరిహారం ఇప్పించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. హక్కులకు భంగం కలిగిన ప్రతి చోటా నిజనిర్ధారణ కమిటీలు వేసి నివేదికలు రాసేవారు. గొర్రెపాటి మాధవరావు రచనలు పదునైనవి. ఆయన ముఖ్యమైన రచనలు ఆచరణలో గతి తర్కం (డిడి కోశాంబీ రాసింది తెలుగులోకి అనువాదం), కార్మిక చట్టాలు, ఆధునిక చైనా విప్లవం, విశ్వ మానవ హక్కుల ప్రకటన (ఐక్యరాజ్యసమితి మానవహక్కుల పత్రం తెలుగులోకి), జాతీయత లేని జాతీయ కాంగ్రెస్ (తెలుగు అనువాదం) చేశారు.



నివాళులర్పిస్తున్న మానవహక్కుల వేదిక నేతలు

గొర్రెపాటి మాధవరావు పార్థివ దేహాన్ని ఆదివారం నిజామాబాద్ మెడికల్ కళాశాలకు, కళ్లను లయన్స్ క్లబ్‌కు అందించనున్నారు. అంతకు ముందు ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కోటగల్లీ నుంచి గొర్రెపాటి మాధవరావు పార్థివ దేహం యాత్ర ఉంటుంది.

క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీలో శనివారం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి సంఘం సెంట్రల్ ఫోరం సభ్యురాలు జి.భారతి, నరేందర్ సమక్షంలో కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంఎస్ఎన్ చారి, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా నాగరాజు ఎన్నికయ్యారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్: వివిధ కేసుల్లో ఎక్సైజ్ శాఖకు పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు వాహనాలను ఈనెల 30న ఉదయం 10గంటలకు వేలం వేస్తామని, ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

సౌత్‌జోన్ ఖోఖో క్రీడాపోటీల్లో తెయూ జట్టు



తెయూ(డిచ్‌పల్లి): తమిళనాడు రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్సిటీ వేదికగా కొనసాగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో తెలంగాణ యూనివర్సిటీ జట్టు పాల్గొంటోంది. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పోటీలు కొనసాగుతుండగా, శనివారం రోజున మహాత్మా గాంధీ యూనివర్సిటీ జట్టుతో తెలంగాణ యూనివర్సిటీ జట్టు తలపడి ఓటమిపాలైంది.

మాదారి రాజన్నకు డాక్టరేట్

ఆర్మూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మాదరి రాజన్నకు తమిళనాడులోని హోసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేశారు. పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర మాజీ అసోసియేట్ ప్రెసిడెంట్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా మాదారి రాజన్న అందించిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. డాక్టర్ కరాటే ఏపీ శ్రీకాంత్, డాక్టర్ కేఎస్ వేణుగోపాల్, డాక్టర్ అరుణ్ చిన్నదురై, డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్, డాక్టర్ చప్పిడి నాగఫణిశ్రీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్‌ను రాజన్న అందుకున్నారు.

మాకు ఉపాధ్యాయులు కావాలి

- బిచ్కుంద కేజీబీవీ విద్యార్థుల డిమాండ్
- తరగతులు బహిష్కరించి ప్లకార్డులతో నిరసన


బిచ్కుందలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థినులు

బిచ్కుంద(జుక్కల్): తమ పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలని బిచ్కుంద కేజీబీవీ విద్యార్థినులు కోరుతున్నారు. ఈమేరకు శనివారం వారు మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో తరగతులు బహిష్కరించి ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయులు నియమించాలని, బోధన కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కేజీబీవీ టీచింగ్ ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 19 రోజుల నుంచి సమ్మెబాట పట్టారు. దీంతో పాఠశాలలో విద్యాబోధనకు బ్రేక్ పడడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. పరీక్షలు దగ్గరపడుతుండటం, సిలబస్ పూర్తికాకపోవడంతో చదువులు కొనసాగక పరీక్షలు రాయలేని పరిస్థితి నెలకొందని పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి పాఠశాలలో సెక్యూరిటీగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్ పాఠశాల చేరుకొని విద్యార్థినులకు నచ్చజెప్పి ప్రతిరోజు పాఠాలు బోధించేవిధంగా తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమిస్తామని నచ్చజెప్పారు. ఎస్సైతో మాట్లాడి రాత్రికి సెక్యూరిటీగా ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను నియమిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

విష పురుగుల సంచారం..

కేజీబీవీ పాఠశాల ఆవరణలో శనివారం (పాము) విష పురుగులు సంచరించాయి. పామును చూసిన విద్యార్థినులు పరుగులు తీశారు. అప్పుడప్పుడు పాములు వస్తుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చదువుతున్నామని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. గతంలో కూడా ఈ పాఠశాలలో ఓ విద్యార్థిని పాము కాటుతో మృతి చెందింది. అప్పట్లో అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టగా, కొంత భాగం వదిలేశారు. పాఠశాల వెనకభాగంలో పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా కలెక్టర్, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జీపీ కార్మికులను క్రమబద్ధీకరించాలి


కలెక్టరేట్ ధర్నా చౌక్ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం పట్టణంలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించకుంటే వచ్చే నెల నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. బాలనర్సు, ఉపాధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి సాయిలు నాయకులు రూప్ సింగ్, మల్లేశ్, కవిత, లక్ష్మన్, రాజు, మోహన్, అరవింద్, నరేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజనర్సు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జనవరి 4, 5 తేదీలలో 48గంటల పాటు దీక్షలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే 6న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, 27నుంచి సమ్మెకు వెళ్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి మహబూబ్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, ప్రభు, దీపక్, శివరాజవ్వ, గంగాధర్, జ్యోతి, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కంకరతో వాహనదారుల కష్టాలు


మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రం సమీపంలో రోడ్డుపై వేసిన కంకర

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో సమీపంలో రోడ్డుపై వేసిన కంకరతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం సమీపంలో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రం సమీపంలో రహదారిపై కంకర వేశారు. విత్తనోత్పత్తిక్షేత్రం నుంచి రహదారికి మరోవైపు ఉన్న ఉద్యాన క్షేత్రంలోకి పైపులైన్ వేశారు. ఇందుకోసం ప్రధాన రహదారిని అడ్డంగా తవ్వి పైపులైన్ వేసి, కంకర వేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోతున్నారు. గడిచిన వారంరోజుల్లోనే పలువురు ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై వేసిన కంకర వల్ల ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిగురాకుల్లో ఎన్నెన్ని అందాలో..



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని జక్కాపూర్ గ్రామ శివారులోని ఓ పంట చేనులో మామిడి చెట్టు రంగురంగు అందాలతో చూపరులను ఆకట్టుకుంటుంది. పచ్చని పంటచేనులో మామిడిచెట్టుకు పూతతోపాటు కొమ్మలు, చిగురాకులతో ఆకట్టుకుంటున్నాయి. ఈ చెట్టును అటుగావెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం


నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న అధికారులు

రామారెడ్డి: రైతులు, ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్నారం సబ్‌స్టేషన్‌లో శనివారం ఆయన నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి, ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వేసవి కాలానికి సరిపడ విద్యుత్ డిమాండ్‌కు అంతరాయం లేకుండా సరఫరాను అందించడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నారం గ్రామ రైతులు విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యను పరిష్కరించడంతో హర్షం వ్యక్తం చేశారు. డీఈలు కళ్యాణ చక్రవర్తి, నాగరాజు, ఏడీఈలు నరేష్ కుమార్, చంద్రకాంత్‌వర్మ, జయరాజ్, ఏఈలు లక్ష్మీనరసింహ, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఆటోల పార్కింగ్


నిజాంసాగర్ బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా నిలిపిన ఆటోలు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోగల ప్రధాన రోడ్డుపై ప్రయివేట్ వాహనాలతోపాటు ఆటోలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్‌లోకి తాము వెళ్లడానికి వీలులేకుండాపోతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకుండా పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఆటోలు, ప్రయివేట్ వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కల్గుతుందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మండలకేంద్రంలో ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టు పనుల పరిశీలన


లింగంపేటలో పనులను పరిశీలిస్తున్న అధికారులు


లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కట్టుకాలువపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను శనివారం నీటిపారుదల శాఖ డీఈఈ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. పెద్దవాగు మత్తడి కాల్వ నుంచి చీరపేండ్ల కుంట, సూర్ణ కుంటలోకి సాగునీరు సరఫరా చేసే కాలువ పూడుకపోయి శిథిలావస్థకు చేరుకుంది. ఈక్రమంలో కాలువ మరమ్మతులతో పాటు కల్వర్టుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 49లక్షలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. ఏఈ మధు తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్ఆర్ కళాశాలకు న్యాక్ గుర్తింపు



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ (బిప్లస్‌ప్లస్ గ్రేడ్) గుర్తింపు వచ్చిందని విద్యా సంస్థ చైర్మన్ మారయ్యగౌడ్ తెలిపారు. కళాశాలలో డైరెక్టర్లతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలను 1993లో స్థాపించామని, నాటి నుంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. న్యాక్ బృందం సభ్యులు మూడు రోజులపాటు కళాశాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారని, తమ కళాశాలకు న్యాక్ గుర్తింపు ఇస్తున్నట్లు ఢిల్లీ నుంచి శనివారం ఈ మెయిల్ వచ్చినట్లు తెలిపారు. ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న తమ కళాశాలకు న్యాక్ గ్రేడ్ బి ప్లస్ ప్లస్ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణమన్నారు. మరింత మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను జోడిస్తూ విద్యనందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామన్నారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలు, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ హరితాగౌడ్ పాల్గొన్నారు.

డీసీసీబీలో మాజీ చైర్మన్ ఫొటో ఎక్కడ?



సుభాష్‌నగర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో మాజీ చైర్మన్ల ఫొటోలు పెట్టడం ఆనవాయితీ. ఈ సాంప్రదాయానికి ప్రస్తుతం నిజామాబాద్ డీసీసీబీ అధికారులు మంగళం పాడారు. గత నాలుగేళ్లపాటు డీసీసీబీ చైర్మన్‌గా సేవలందించిన పోచారం భాస్కర్‌రెడ్డి ఫొటోను ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేయడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న రమేశ్‌రెడ్డి పట్టించుకోకపోవడం కారణంగానే ఈ పరిస్థితి అని ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విమర్శలు చేస్తున్నారు. కేవలం పోచారం భాస్కర్‌రెడ్డిని అవమానించాలనే ఉద్దేశంతోనే ఫొటో ఏర్పాటు చేయాలనే సాంప్రదాయానికి బ్రేక్ వేశారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఫొటో ఏర్పాటు చేయాలని డైరెక్టర్లు కోరుతున్నారు.

క్రైం కార్నర్

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్‌కు చెందిన వివాహిత కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోరబోయిన రాజమణి(57) అనే వివాహిత పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన కాదరి కుమార్ (40) అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామునా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుమార్ తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



బాల్కొండ: అనారోగ్యంతో బాధపడుతూ ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన బొప్పారం ముత్తెన్న (48) సౌదీ అరేబియాలో మృతి చెందగా, ఆయన మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. గత కొంత కాలంగా సౌదీఅరేబియాలో ఉంటున్న ముత్తెన్న నెల రోజుల క్రితం అనారోగ్యంబారిన పడడంతో అక్కడి ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. గల్ఫ్‌కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు, పోతుగంటి సాయేందర్ రాష్ట్ర ప్రభుత్వ అధికారి చిట్టిబాబుతో మాట్లాడి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, మృతదేహన్ని స్వగ్రామానికి చేర్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ముత్తెన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బైక్ చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంట కాలనీకి చెందిన బాలేరావ్ నరేందర్‌కు చెందిన బైక్‌ను చోరీ చేసిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. తన స్ప్లెండర్ ప్రో బైక్ (ఏపీ 25ఏహెచ్ 3972)ను దుండుగులు ఎత్తుకెళ్లారని నరేందర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. కుసుమ సాయికుమార్ అనే వ్యక్తి బైక్‌చోరీకి పాల్పడినట్లు గుర్తించామని, నిందితుడిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయం పక్కన నివాసం ఉండే కొట్టూరి సుశీల ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. సుశీల మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లిందన్నారు. శనివారం ఆమె ఇంటికి వచ్చిన సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, ట్రంకు పెట్టెలో దాచిన అరతులం బంగారంతోపాటు రూ.10వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఇంట్లో ఉన్న విలువైన దుస్తులను దహనం చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

పెర్కిట్‌లో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెర్కిట్‌లో ఓ మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గోలుసును లాక్కెళ్లారు. పెర్కిట్‌కు చెందిన మహిళ తన ఇంటికి వెళ్తున్న సమయంలో స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండగులు వెనుక నుంచి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఒక్కొక్కటిగా బయటికి..

- మానిక్‌బండార్ వెంచర్‌లో అక్రమాలెన్నో..
- ఇప్పటి వరకు మూడుసార్లు విచారణ పూర్తి
- ఎండోమెంట్ భూమి ఉన్నట్లు నిర్ధారణ

సాక్షి ఎఫెక్ట్..


మానిక్‌బండార్ వెంచర్‌లో సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

మాక్లూర్: మండలంలోని రెండో డివిజన్ పరిధిలో ఉన్న మాణిక్‌బండార్ శివారులో 217 ఎకరాల్లో వెలిసిన ప్రైవేట్ వెంచర్‌లో పేదల భూములతోపాటు ఇరిగేషన్, దేవాదాయ భూమి సుమారు 5 ఎకరాల వరకు కబ్జా అయినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. విలీన గ్రామాల అభివృద్ధికి వెచ్చించాల్సిన రూ.10కోట్ల టీయూఎఫ్‌డీసీ నిధులను దారి మళ్లించి వెంచర్ కోసం రెండు వంతెనలను నిర్మించారు. ప్రైవేట్ వెంచర్‌లో అక్రమాలపై గతంలో అధికారులకు స్థానిక కార్పొరేటర్ రాయ్‌సింగ్ ఫిర్యాదు చేశారు. అలాగే వెంచర్‌లో అక్రమాలపై 'సాక్షి' కథనాలను ప్రచురించింది. దీంతో పనులను కొద్దికాలం నిలిపివేసి మళ్లీ ప్రారంభించారు. ఇటీవల కార్పొరేటర్ రాయ్‌సింగ్ మళ్లీ సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, రెండోసారి కూడా 'సాక్షి'లో మరో కథనం ప్రచురితమైంది. శనివారం నాటితో అధికారులు మొత్తం మూడుసార్లు సర్వే చేశారు. అధికారులు తేల్చాల్సింది టీయూఎఫ్‌డీసీ నిధులు రూ.10 కోట్ల దుర్వినియోగంపైనే అని పలువురు అంటున్నారు. ప్రభుత్వ నిధులను వెంచర్‌కు కేటాయించిన అప్పటి ప్రజాప్రతినిధికి రియల్టర్లు కొంత భూమిని గిఫ్ట్‌గా ఇచ్చారనే ఆరోపణలున్నాయి. శనివారం నిర్వహించిన విచారణలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ, సర్వేయర్ కిషన్ నాయక్, కార్పొరేటర్ రాయ్‌సింగ్, సాగునీటి సంఘం మాజీ చైర్మన్ ప్రభు ఉన్నారు.

చెరుకు లారీ బోల్తా


రోడ్డు పక్కన బోల్తాపడిన చెరుకు లారీ

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ శివారులో చెరుకు లారీ బోల్తా పడింది. మహారాష్ట్ర నుంచి చెరుకు లోడ్‌తో నిజాంసాగర్ మండలంలోని ఫ్యాక్టరీకి వెళ్తుండగా శుక్రవారం రాత్రి కల్లూర్ గ్రామ శివారులో అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

బల్దియా వాటర్ ట్యాంకర్..


బోల్తా పడిన ట్రాక్టర్ ట్యాంకర్

కామారెడ్డి క్రైం: డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో అదుపు తప్పి బల్దియా వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హైదబాద్ రోడ్‌లో శనివారం చోటుచేసుకుంది. హౌసింగ్ బోర్డు వైపు నుంచి నిజాంసాగర్ చౌరస్తా వైపు వస్తున్న ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు బోల్తా పడగా డ్రైవర్ రవికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వెంటనే ట్యాంకర్‌ను పక్కకు తీయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ఘటనాస్థలంలో క్షతగాత్రులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ మూలమలుపు వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తున్న ఇస్సాపల్లి గ్రామానికి చెందిన ఇట్టెం శ్రీధర్ ముప్కాల్‌లో పని ఉండటంతో వన్నెల్‌దాస్ గంగాధాంతో కలిసి బైక్‌పై శనివారం వెళ్లాడు. తిరిగి వస్తున్నక్రమంలో చేపూర్ క్రాసింగ్(చౌరస్తా) ఆర్మూర్ నుంచి చేపూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజేశ్వర్ వేగంగా వచ్చి శ్రీధర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో గంగారాం తల, చేతులకు తీవ్రగాయలు కాగా శ్రీధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని ఎస్సై మహేశ్ పరిశీలించారు. బాధితులను 108 అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలోపడి మృతి

మాచారెడ్డి: డప్పు రిపేర్ చేయించుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటి కుంటలోపడి మృతి చెందాడు. ఈ ఘటన పాల్వంచ మండలం మంతన్‌దేవునిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గుండెల్లి దేవరాజు(39) అనే యువకుడు ఈ నెల 25న తన డప్పు రిపేర్ చేయించుకునేందుకు కామారెడ్డికి వెళ్లాడు. ఆ రోజు రాత్రి వరకు ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి పాల్వంచ శివారులోని చామల కుంటలో దేవరాజు శవమై కనిపించినట్లు ఎస్సై తెలిపారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉంటాడని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

డిచ్‌పల్లి(మోపాల్): అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను మోపాల్ మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి శనివారం తెలిపారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటలో శనివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన నేకపు నర్సయ్య పెంకుటిల్లు దగ్ధమైంది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు వ్యాపించిన వెంటనే నర్సయ్య కుటుంబ సభ్యులు బయటికి వచ్చేశారు. ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి.

సమ్మె నోటీసు అందజేత



కామారెడ్డి టౌన్: సివిల్ సప్లయ్ హమాలీల డిమాండ్‌ల పరిష్కారం కోసం జనవరి 1నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు తెలిపారు. కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి భిక్షపతికి సమ్మె నోటీసును శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీలకు కూలీ రేట్లను పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, కల్పించాలని ఎన్నో పోరాటాలు చేసిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీంతో సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. దశరథ్, హమాలీలు బాబ్జీ, మైపాల్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.